

ఏం జనం రా స్వామీ..



వ్యాపారులు, కొనుగోలుదారులతో కిక్కిరిసిన సంత ప్రాంగణం

మాలపున్నమి సందడి..!

- కిటకిటలాడిన అనంత గొర్రెలు, మేకల సంత

తగ్గులను ఓ తగులు తగలాల్సిందే..



ఏది కావాలో చూడండి..కొనేయండి..

నాటు కోడికి భలే గిరాకీ



అనంతపురం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు వినాయక చవితి పండుగ, నిమజ్జనం ఉండటంతో నాన్‌వెజ్ ప్రియులు ముక్క కోసం మొహం వాచిపోయి ఉన్నారు. గణపతి పండుగ అయిపోవడం, ఆదివారం కావడం అదీ మాల(మహాలయ)పున్నమి కావడంతో ముక్క కోసం మాంసాహారప్రియులు ముందస్తు ఏర్పాట్లు సందడిగా చేస్తున్నారు. అది శనివారం అనంతపురం పశువులు, మేకలు, గొర్రెల సంతలో స్పష్టంగా కనిపించింది. మాలపున్నమి నేపథ్యంలో మార్కెట్ వ్యాపారులు, కొనుగోలుదారులతో కిటకిటలాడింది. గత నెలన్నర రోజులుగా శ్రావణమాసం, గణేష్ చతుర్థి నేపథ్యంలో సంతలో సందడి అంతగా అగుపించలేదు. ఆదివారం మాలపున్నమి కావడంతో సంత ప్రాంగణం ప్రధారోడ్డు పొడవునా..వ్యాపారులు పొట్టేలను క్యూ కట్టించారు. మార్కెట్‌కు వచ్చిన వారితో గుత్తి-అనంతపురం ప్రధాన రోడ్డు కిలోమీటరుకుపైగా ద్విచక్రవాహనాల పార్కింగ్ కనిపించింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మార్కెట్‌లో ధరలు కూడా సాధారణం కంటే రెండు, మూడు రెట్లు అదనంగా పెంచేశారు.

పుంజు రేటెంతన్నా ?



మళ్లీ వెరిఫికేషన్

- డీఎస్సీ-2025లో బోగస్‌ల నివారణకు చర్యలు
- రేపు ఇతర జిల్లా బృందాలతో పరిశీలన

(వివరాలు 6వ పేజీలో...)

రేపు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఈ నెల 8న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని కలెక్టర్ వినోద్ కుమార్ శుక్రవారం తెలిపారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన స్లిప్పును వెంట తీసుకురావాలని సూచించారు.

సూపర్ హిట్ సభకు 3500 బస్సులు

- ఆర్టీసీ అధికారులతో మంత్రుల సమీక్ష (6లో..)



మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు

సంక్షేమం.. అభివృద్ధి డబుల్

వెంటిలేటర్‌పై నుంచి సాధారణ స్థితికి రాష్ట్రం

- పథకాలు, పాలసీలపై వైసీపీ చిల్లర రాజకీయం
- మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్
- 10న జరిగే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభపై సమీక్ష

అనంతపురం క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పైకి తెచ్చిందని, కూటమి ప్రభుత్వం తిరిగి సామాన్య స్థితికి తీసుకొచ్చిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 10వ తేదీ జరిగే 'సూపర్ సిక్స్- సూపర్‌హిట్' బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, నారాయణ, రవికుమార్, కొల్లు రవీంద్ర, సవిత, రాంప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్‌తో కలిసి సమీక్షించారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభ జరిగే ప్రాంతానికి మంత్రులు చేరుకున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో సుమారు గంటపాటు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్థిక లోటుతో ఉన్న రాష్ట్రాన్ని కేంద్రం సహకారంతో గాడిలో పెడుతున్నామని పయ్యావుల అన్నారు. డబుల్ సంక్షేమం, డబుల్ అభివృద్ధి అందించే స్థితికి రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.3 వేలు ఫించన్ ఇస్తే తాము రూ.4 వేలు చేశామని, వారు 42 లక్షల మందికి పింఛన్లు ఇస్తే.. తాము 64 లక్షల మందికి ఇస్తున్నామని అన్నారు. రైతు భరోసా రూ.7 వేలు ఇస్తే తాము అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తున్నామని తెలిపారు. పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని అన్నారు. గత నెల 15న ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ మాట్లాడుతూ.... పండుగ రోజుల్లో దీపావళి డబుల్ ధామాకా జరుపుకుంటారని అన్నారని గుర్తు చేశారు. ఆ మాట ప్రకారం జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సామాన్యు తీసుకునే వస్తులపై జీఎస్టీ తగ్గించారని, కొన్నింటినీ పూర్తిగా ఎత్తివేశారని అన్నారు. ప్రధాని సాహసోపేత నిర్ణయాలకు సీఎం చంద్రబాబు మద్దతు తెలిపారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అద్భుతమైన కార్యక్రమాలు తీసుకొచ్చిందని మంత్రి అనగాని అన్నారు. ఈ పథకాలు, పాలసీల గురించి

(మిగతా 6వ పేజీలో...)

సభ సూపర్ హిట్ అవ్వాలి

- జనసేన జిల్లా అధ్యక్షుడు వరుణ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న సూపర్ సిక్స్- సూపర్ హిట్ బహిరంగ సభను జయప్రదం చేయాలని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని యాదవ కల్యాణమండపంలో అనంతపురం ఉమ్మడి జిల్లా జనసేన నాయకుల సమావేశం టీసీ వరుణ్ అధ్యక్షతన నిర్వహించారు. బహిరంగ సభ విజయవంతానికి ఎవరు ఏమి పనులు చేయాలన్న అంశంపై చర్చించారు. డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి జనసేన అధినేత జిల్లాకు వస్తున్నారని, ఆయనకు ఘనస్వాగతం పలకడానికి జన సైనికులు సిద్ధం కావాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి జనసైనికుడు 10న అనంతపురం సభలో ఉండేలా చూడాలన్నారు. జిల్లా కేంద్రంలో ప్రతి డివిజన్ నుంచి వెయ్యి మంది బహిరంగ సభకు తరలి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహాసభను సక్సెస్ చేయటానికి జనసేన పార్టీ నుంచి పలు కమిటీలు, సభ్యులను ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సురేష్, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు క్రిష్ణ, రాష్ట్ర నాయకులు లక్ష్మీపతి, రాయలసీమ ప్రాంతీయ మహిళా అధ్యక్షురాలు శ్రీలత, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ భవానీ రవికుమార్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు అంకే ఈశ్వర్ పెర్కొన్నారు.

అద్దె భవనంపైనే మోజు..!

సొంత భవనానికి బూజు

- అటకెక్కిన ఐవీ స్టాండ్లు, మంచాలు
- షాక్ కొడుతున్న వైద్య పరికరాలు
- నిరుపయోగంగా అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రమే అనారోగ్యానికి గురైంది. గత ప్రభుత్వ అలసత్వం కారణంగా ఐదేళ్లుగా అద్దెభవనంలోనే కొనసాగుతోంది. నూతన భవన నిర్మాణం పేరుతో కుటుంబం నివాసముండే ఇంటిలోకి ఆరోగ్య కేంద్రాన్ని తరలించారు. ఇరుకిరుకు గదుల్లోనే ఓపీ, ఫార్మసీ, ల్యాబ్, స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఇక ఐపీ సేవలను పక్కన పెట్టేశారు. దీంతో మంచాలు మూలన పడటంతో ఐవీ స్టాండ్లు అటకెక్కాయి. లీకేజీ కారణంగా గోడలకు కరెంట్ షాక్ తగులుతోంది. వైద్యపరీక్షలు నిర్వహించే పరికరాలు షాక్ కొడుతున్నాయి. వైద్యసేవల ఉపకరణాలు, పరికరాలు నిల్వ చేయడానికి వీళ్లేకుండా పోయింది. డాక్టర్ వద్దకు ఒకరు వెళ్తే తిరిగి వచ్చేంతవరకు మరొకరు వెళ్లేందుకు వీళ్లేని పరిస్థితి. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఉందనే విషయం తెలియని విధంగా ఒక చిన్నవీధిలో ఏర్పాటు చేశారు. సొంత భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినా ఇంకా అద్దె భవనంలో కొనసాగడంలో ఆంతర్యమేమిటో అధికారులకే తెలియాలి. కొత్త భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలుస్తుండగా.. లోపల బూజు పడుతోంది. అనంతపురం నగరంలోని జీసస్ నగర్‌లో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్ దుస్థితి.

మున్నా నగర్ నుంచి మిస్సమ్మ కాలనీ వరకు...

తొమ్మిది వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేలా పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జీసస్‌నగర్‌లోని ఒకచిన్న సందులో ఏర్పాటు చేశారు. మున్నానగర్, ప్రభాకర్ కాలనీ, అంబేద్కర్ నగర్, మరువకొమ్మ కాలనీ వరకు.. సాయినగర్ నుంచి మిస్సమ్మ కొట్టాల వరకు సంబంధించిన పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందించాలి. గర్భిణిలు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు చూడాలి. రోజువారి ఓపీ, ఐపీ సేవలందించాలి. ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ పథకం కింద వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాల వెనుక సమీపంలోని డాక్టర్లు, సిబ్బంది క్వార్టర్స్‌లోనే నూతన వైద్యకేంద్రాన్ని నిర్మించారు.

నిరుపయోగంగా నూతన భవనం

ఆరోగ్య కేంద్రాల విస్తరణలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించింది. వాటికి గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ అని పేరు తగిలించుకున్నారు. గత ప్రభుత్వ అలసత్వంతో ఏ ఒక్క ఆరోగ్య కేంద్రాన్ని సకాలంలో నిర్మించి వినియోగంలోకి తీసుకురాలేకపోయారు. ఎన్నికల సమయానికి అరకొరగానే నిర్మించి వదిలేసి పోయారు. తిరిగి ఆ భవన నిర్మాణ పనులు పునఃప్రారంభించి పూర్తిచేశారు. భవనాలు నిరుపయోగంగా మారిపోయాయని రోగులు మండిపడుతున్నారు. ఈ ప్రభుత్వంలో ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



జీసస్ నగర్‌లో అద్దెభవనంలో కొనసాగుతున్న పట్టణ ఆరోగ్య కేంద్రం

కమిషనర్ దృష్టికి తీసుకెళ్లా

జీసస్‌నగర్‌లోని అద్దెభవనంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లా. సమస్యల కారణంగా ఓపీ సంఖ్య రోజుకు 50వరకు మాత్రమే నమోదవుతోంది. 10 పడకలకు ఆరోగ్య కేంద్రంలో మంచాలను ఏర్పాటు చేసి ఐపీ సేవలించేందుకు వీళ్లేకుండా పోయింది. గోడలకు విద్యుత్ షాక్‌తో పరికరాలు పాడైపోతున్నాయి. ఈ సమస్యల నుంచి గట్టెక్కేలా డాక్టర్స్ క్వార్టర్స్‌లో నిర్మించిన నూతన భవనం వినియోగంలోకి తీసుకుంటామని కోరాం. ఆదేశాలు రాగానే నూతన భవనంలోకి తరలిస్తాం.

- డాక్టర్ ఈర్ల భ్రమరాంబిక దేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



సెల్ఫ్‌పై పడేసిన ఐవీ స్టాండ్లు



మూలనపడ్డ మంచాలు



పిచ్చి మొక్కల మధ్య అర్బన్ హెల్త్‌సెంటర్ నూతన భవనం

పారదర్శకంగా యూరియా పంపిణీ : కలెక్టర్

- అక్రమంగా నిల్వ చేస్తే కేసులు

(వివరాలు 7లో..)

నేడు చంద్ర గ్రహణం

- ఉమ్మడి జిల్లాలో మూతపడనున్న ఆలయాలు



కసాపురం ఆలయం

(6లో...)

సీఎంఎన్ ఆసుపత్రి సీజ్



ఆసుపత్రిని సీజ్ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రియుడితో సాన్నిహిత్యం కారణంగా గర్భం దాల్చిన యువతికి అబార్షన్ చేసి, ప్రాణాలను బలిగొన్న నగరంలోని సీఎంఎన్ ఆస్పత్రిని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. ప్రియుడి సూచన మేరకు ఒంటరిగి ఆస్పత్రికి వెళ్లిన యువతికి వైద్యులు కాకుండా అంబులెన్స్ డ్రైవర్, ఆస్పత్రి సిబ్బంది అబార్షన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి, పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఈ నెల 5న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి, అధికారులను సీఎంఎన్ ఆస్పత్రికి పంపి వివరాలను సేకరించారు. డీఎంహెచ్‌ఓ శనివారం స్వయంగా ఆస్పత్రి వద్దకు వెళ్లారు. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో కలిసి పంచనామా చేసి, ఆస్పత్రిని సీజ్ చేయించారు. యువతి మృతిచెందిన రోజే ఆస్పత్రికి నిర్వాహకులు తాళం వేసి పరారయ్యారని డీఎంహెచ్‌ఓ తెలిపారు. తక్షణ చర్యల కింద నోటీసులు అతికించామని, ఆస్పత్రిని సీజ్ చేశామని తెలిపారు. డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్, లీగల్ అడ్వైజర్ ఆశారాణి, వీఆర్వో నాగవేణి, కానిస్టేబుల్ ప్రసాద్ నాయక్ ఆమె వెంట ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీశుడి ఆలయం



స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు

కదిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం భక్తులతో శని వారం కిటకిటలాడింది.. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శం చుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయా నికి చేరుకు న్నారు. దీంతో ఆలయ సమీప ప్రాంతాల్లో సందడి నెలకొంది.

నేడు చంద్ర గ్రహణం

ఉమ్మడి జిల్లాలో మూతపడనున్న ఆలయాలు

న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలన్నీ ఆదివారం మధ్యాహ్నం నుంచే మూతపడనున్నాయి. భారత కాలమానం ప్రకారం ఆది వారం రాత్రి 9.50 గంటలకు గ్రహణ స్పర్శకాలం, 10.58 గంటలకు ఉన్మీలన కాలం, 11.41 గంటలకు నిమీలన కాలం, రాత్రి 1.31 గంటలకు గ్రహణ మోక్ష కాలం, 8న తెల్లవారుజామున 3.41 గంటలకు ఆద్యంత పుణ్యకాలంతో గ్రహణం వీడనుంది. ఈ నేపథ్యంలో కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నార్పల మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలు, బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయం, లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయం, కసాపురం ఆంజనేయస్వామి ఆలయం, మురడి ఆంజనేయస్వామి ఆలయాలను మూసివేయనున్నట్లు ఆయా ఆలయాల అధికా రులు, అర్చకులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1గంట నుంచి మూసి వేసి, సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, పూజల అనంతరం భక్తులకు దైవ దర్శనం చేయించనున్నట్లు అధికారులు తెలిపారు.



హుండీ సొమ్మును లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

హుండీ ఆదాయం రూ.33.75 లక్షలు

ఉరవకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. కర్నూలు జేవీవీ కార్యాలయం అధికారి మాధవస్వామి, ఆలయ ఇన్‌చార్జి ఈవో తిరుమల రెడ్డి పర్యవేక్షణలో హుండీలను తెరచి సొమ్మును లెక్కించారు. 110రోజులకు రూ.33,75,028లుఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. అలాగే 12గ్రాములు బంగారం, 697గ్రాములు వెండి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రేగాటి నాగరాజు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా శాఖలో ఉపకార వేతనాలు

- 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు అర్హులు
- దరఖాస్తుకు ఈనెల 16 వరకూ గడువు



దీన్ దయాళ్ యోజన ఉపకార వేతన వివరాల కరపత్రిక

ఉరవకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థుల్లో సృజనాత్మకత, జిజ్ఞాసను పెంపొందించేందుకు తపాల శాఖ దీన్ దయాళ్ స్పర్శ యోజనా పేరిట పోటీ పరీక్షలు నిర్వహిస్తోంది. చరిత్ర, క్రీడలు, విజ్ఞానం, సమకాలీన అంశాలు, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశ్యం. తపాల బిళ్లల సేకరణ, అధ్యయనంతో కలిగే ప్రయోజనాలు వివరించేందుకే ఏటా ఈ పోటీలు నిర్వహి స్తున్నట్లు తపాలా శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఉప కార వేతనాల పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని చెబుతు న్నారు. వివరాలకు అనంతపురం ప్రధాన తపాల కార్యాలయంలో సంప్రదించాలని సూచిస్తున్నారు.

రెండు దశల్లో ఎంపిక

మొదట స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. దీనిలో జనరల్ నాలెడ్జ్, స్టాంపులు, వర్తమాన అంశాల నుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణులైన విద్యార్థులు రెండో దశలో ప్రాజెక్టు వర్క్ చేయాలి. ఇందులో జంతువులు, పక్షులు, ప్రదేశాలు, పూలు, సంగీతం విభాగాల్లో ఒక అంశాన్ని ఎంచుకుని ప్రాజెక్టు వర్క్ పూర్తి చేయాలి. పూర్తయిన ప్రాజెక్టును విజయవాడ తపాల శాఖ సర్కిల్ కార్యాలయానికి పంపాలి.

దరఖాస్తుల స్వీకరణ

విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధాయుడి ద్వారా ఈ నెల 16వ తేదీ లోపు అనంతపురంలోని తపాల శాఖ ప్రాంతీయ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలి. తపాల శాఖలో రూ.200 చెల్లించి, విద్యార్థి పేరుతో లేదా ప్రధానోపాధ్యాయుడి పేరుమీద ఫిలాటలి ఖాతా, ఫిలాటలి క్లబ్ ఖాతా తెరవాలి. ఖాతా తెరవగానే రూ.180 విలువ చేసే తపాల బిళ్లలు ఇస్తారు. ఇవి పోటీ పరీక్షలు రాసే వారికి ఉపయోగపడతాయి. పరీక్ష తేదీని తపాల శాఖ వారు హెచ్ఎంలకు తెలియజేస్తారు.

ప్రతి నెలా రూ.500 పొందవచ్చు

రెండు దశల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను విజయవాడ తపాల శాఖ సర్కిల్ కార్యాలయం అధికారులు ఎంపిక చేస్తారు. వీరికి ప్రతినెలా రూ.500 చొప్పున, ఏడాదికి రూ.6వేలు ఉపకారవే తనం అందిస్తారు. ఈ సాయం పొందేందుకు విద్యార్థులు తమ పేరు, తల్లిదండ్రుల పేరుతో తపాల శాఖలో జాయింట్ సేవింగ్ ఖాతాను తెరవాల్సి ఉంటుంది.

మళ్లీ వెరిఫికేషన్

- డీఎస్సీ-2025లో బోగస్‌ల నివారణకు చర్యలు
- రేపు ఇతర జిల్లా బృందాలతో పరిశీలన

అనంతపురం విద్య, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025కు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు సమాచారం. గత నెల 28, 29న కమిటీ బృందాలు 770మంది సెలెక్టెడ్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆరోపణలు వస్తుండటంతో వాటిని మళ్లీ పరిశీలించాలని రాష్ట్ర అధికారులు ఆదేశించారు. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో ఈనెల 4న రీవెరిఫికేషన్ చేయించారు. అప్పుడు కూడా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అనేక రిమార్క్‌లు వచ్చాయి. అనంతపురం జిల్లా నుంచి కూడా ఆరుగురు అభ్యర్థుల ఎంపిక సమాచారాలపై రిమార్క్యులు వచ్చాయి. వీటిపై రాష్ట్ర కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కొన్నిజిల్లాల డీఈఓలకు షోకాజ్‌లు, చార్జ్‌మెమోలు ఇచ్చినట్లు సమాచారం. అలాగే ముందుగా పరిశీలించిన బృందసభ్యులతో కాకుండా మరో కమిటీతో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించాలని ఆదేశించారు. దీంతో ఈనెల 5న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రీ వెరిఫికేషన్ చేయించారు. అపుడు కూడా అనేక రిమార్క్యులు బయటపడ్డాయట.



సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేస్తున్న కమిటీ బృందం

అనంతపురం జిల్లాలో కూడా మరో ఐదుగురు అభ్యర్థుల సమాచారంలో రిమార్క్యులు బయటపడ్డాయని విద్యాశాఖ యంత్రాంగం వెల్లడించింది. ఓ జిల్లాలో కమిటీలో ఉన్న ఓ ఎంఈఓ ముందస్తుగా డబ్బులు మాట్లాడుకొని బోగస్‌లకు అండగా నిలిచి, తప్పుడు సర్టిఫికెట్లు పెట్టినా, అన్నీ సక్రమంగా ఉన్నట్లు పరిశీలన చేసి అప్‌లోడ్ చేసి పంపారట. అయితే ఆధారాలతో దొరకిపోవడంతో ఆ ఎంఈఓను సర్వీస్ నుంచి తొలగించేందుకు కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

ఇతర జిల్లా బృందాలతో ..

ఇప్పటివరకు జిల్లాలో ఏర్పాటు చేసిన పరిశీలన బృందాలతోనే డీఎస్సీ అభ్యర్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. జిల్లాలో పలువురు నకిలీల వ్యవహారాలు, డ్రామాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్, పీహెచ్, స్టడీ, కుల సర్టిఫికెట్లపై విమర్శలు రావడంతో దాదాపు 20కి పైగా అభ్యర్థులను పెండింగ్ పెట్టారు. కొందరిని రిజెక్ట్ చేసి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించారు. ఇంకా కొందరి సర్టిఫికెట్ల పై రెవెన్యూ, ఇతర శాఖల నుంచి స్పష్టత రావాల్సిఉంది. ఈ నేపథ్యంలో ఇతర జిల్లా బృందాలతో అభ్యర్థుల సర్టిఫికెట్లను రీవెరిఫికేషన్ చేయిస్తున్నట్లు సమాచారం. సోమవారం ఇతర జిల్లా కమిటీలు అనంతపురం జిల్లాకు వచ్చే అవకాశం ఉందని, వారిద్వారా మళ్లీ సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. దీంతో అభ్యర్థుల కన్నా విద్యాశాఖ అధికారులు, సిబ్బందే ఎక్కువగా టెన్షన్ పడుతున్నారు.

అనంత కవులకు పురస్కారాలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కవులు ఏలూరు యంగన్న, ఒంటెద్దు రామలింగారెడ్డి.. జోళదరాసి చంద్రశేఖరరెడ్డి స్మారక పురస్కారాలను అందుకున్నారు. బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరిని పురస్కారాలకు ఎంపిక చేశారు. బళ్లారిలోని బసవ రాజేశ్వరి విద్యాలయం ఆవరణలో శనివారం సాయంత్రం పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శీలా బ్రహ్మయ్య, సాహితీ ప్రముఖులు వీరికి పురస్కారాలను అందజేసి సత్కరించారు.

ఉద్యోగ విరమణ సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ, ఏఎస్ఐలను సత్కరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలు అందించి, ఉద్యోగ విరమణ చేసినవారిని ఎస్పీ రత్న ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు కళావతి, శ్రీరాములు, ఏఎస్ఐలు మస్తాన్, వెంకట్రాముడును జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆమె సత్కరించారు. ప్రతి ఉద్యోగికీ విరమణ సాధారణమని, విధులలో ప్రజలకు అందించే సేవలే శాశ్వతమని అన్నారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

వృద్ధాప్యంలో భరోసా !

- వృద్ధులకు ఆసరాగా పీఎం కిసాన్ మాన్‌ధన్
- ప్రీమియం కడితే 60 ఏళ్లు దాటాక పింఛను



కదిరి అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో జీవనోపాధి లేని, ఖర్చులు భరించడానికి కనీస పొదుపు లేని చిన్న, సన్నకారు రైతులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మాన్‌ధన్‌తో పింఛన్ యోజన అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా 60 ఏళ్లు దాటిన సన్న, చిన్నకారు రైతులకు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున జీవిత కాలం పింఛను అందుతుంది. ఈ పథకంలో చేరడానికి 40 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులు. ఐదెకరాల్లోపు సొంత వ్యవసాయ భూమి గల సన్నకారు, పీఎం కిసాన్ లబ్ధిదారులు వివరాలు నమోదు చేసుకోవచ్చు. పన్ను చెల్లింపుదారులు, సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్న వారికి వర్తించదు.

ప్రీమియం ఇలా...

18 నుంచి 40 ఏళ్ల వయసున్న రైతులు ప్రతి నెలా రూ. 55 చెల్లిస్తే కేంద్రం తన వాటాగా మరో రూ. 55 కలిపి మొత్తం రూ. 110 జమ చేస్తుంది. 21 ఏళ్ల వారు రూ.61, 25 ఏళ్ల వారు రూ.80, 30 సంవత్సరాల వారు రూ.106, 35 ఏళ్లకు రూ.150, 40 ఏళ్ల వారు రూ. 200 ప్రీమియం చెల్లించాలి. 60 ఏళ్ల తరువాత ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ లభిస్తుంది. ఆ రైతు మరణిస్తే నామినీగా ఉన్న వారికి ప్రతి నెలా రూ. 1500 పింఛన్ జీవిత కాలం అందుతుంది.

దరఖాస్తు ఇలా

పీఎం కిసాన్ లబ్ధిదారులు సీఎస్‌సీ కేంద్రానికి వెళ్లి పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేయించాలి. మొదట ఆధార్, తర్వాత నామినీ వివరాలు దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. అనంతరం పింఛన్ కార్డు వస్తుంది. పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం చెల్లించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



రైతులు వృద్ధాప్యంలో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. మీసేవ కేంద్రాల్లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

\- శ్రీహరి నాయక్, ఏఓ, కదిరి

సూపర్ హిట్ సభకు 3500 బస్సులు

- ఆర్టీసీ అధికారులతో మంత్రుల సమీక్ష



బస్సుల ఏర్పాటుపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 10న నిర్వహించే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభను విజయవంతం చేసేందుకు సమష్టి కృషి చేద్దామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపునిచ్చారు. అనంతపురం బస్టాండు ఆవరణలో వీరు శనివారం సాయంత్రం పర్యటించారు. అనంతరం ఆర్ఎం కార్యాలయంలో సమావేశమై, ముఖ్యమంత్రి సభకు బస్సుల సమీకరణ గురించి సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3,500 బస్సులను ముఖ్యమంత్రి సభకు కేటాయించేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రులు తెలిపారు. ప్రయాణికులకు ఎక్కడా అసౌకర్యం కలగకూడదని, అవసరమైతే ఇతర జిల్లాల్లో అదనంగా ఉన్న బస్సులను సర్దుబాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా ఆర్ఎం మధుసూదన్, అనంతపురం జిల్లా ఇన్‌చార్జి ఆర్ఎం శ్రీలక్ష్మి, డిప్యూటి సీఎంఈ రమేష్ బాబు, డీఎంలు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16వేలు



అనంతపురంరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 699 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఉండమ్మా.. బొట్టు పెడతాం..!

సూపర్ హిట్ సభకు తెలుగు మహిళల ఆహ్వానం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 10న నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు రావాలని కోరుతూ నగరంలోని మహిళలను తెలుగు మహిళలు శనివారం ఆహ్వానించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ మహిళలకు పసుపు రాసి, కుంకుమ బొట్టు పెట్టి మరీ ఆహ్వానిస్తున్నారు. స్థానిక ఆలయాల్లో శనివారం పూజలు నిర్వహించి, ఇంటింటికీ వెళ్లారు. వీరశైవ లింగాయత కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ స్వప్న, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, తెలుగు మహిళ నాయకురాలు వడ్డే భవాని, రాష్ట్ర రజక సాధికార కమిటీ సభ్యులు శోభ, తెలుగు మహిళ జిల్లా ప్రచార కార్యదర్శి కంతా దేవి, కార్యదర్శి మహేశ్వరి తదితరులు రజక నగర్‌లోని వినాయకుడి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం 48, 42, 41 డివిజన్‌లలోని రజకనగర్, జనశక్తి నగర్, 6వ రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగారు. సీఎం సభకు రావాలని ఆహ్వానించారు. మాజీ మేయర్ స్వరూప ఆధ్వర్యంలో 45వ డివిజన్‌లో అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు దళవాయి రమాదేవి, మాజీ కార్పొరేటర్లు సరళ, భూలక్ష్మి, తెలుగు మహిళలు చరిత, రమాదేవి, రంగమ్మ, రాణి, వనజ, ఈశ్వరమ్మ తదితరులు ఇంటింటికీ తిరిగారు. ముఖ్యమంత్రి సభకు రావాలని ఆహ్వానించారు.



బొట్టు పెడుతున్న మాజీ మేయర్ స్వరూప, ఇతర నేతలు



బొట్టు పెడుతున్న స్వప్న, తేజశ్విని ఇతర నేతలు

భార్యను హత్య చేసిన భర్త



మోహన్‌తాజ్ (ఫైల్)

గాండ్లపెంట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భార్యను రోకలిబండతో కొట్టి చంపిన సంఘటన మండలంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని తూపల్లి గ్రామానికి చెందిన మన్సూర్, మెహన్‌తాజ్‌కు (30) 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి 12 సంవత్సరాల కుమారుడు నిహార్, 10 సంవత్సరాల కుమార్తె మినహ ఉన్నారు. పిల్లలతో కలిసి మోహన్‌తాజ్ శుక్రవారం దుస్తుల కోసం మదనపల్లికి వెళ్లి, తిరిగి రాత్రి 9గంటలకు స్వగ్రామానికి చేరుకున్నారు. దీనిపై మన్సూర్ తన భార్య మెహన్‌తాజ్‌తో గొడవపడ్డాడు. అందరూ పడుకున్న తర్వాత అర్ధరాత్రి సమయంలో ఇంటిలో నిద్రిస్తున్న భార్య మెహన్‌తాజ్ తలపై రోకలిబండతో మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎన్పీకుంట ఎస్ఐ వలీబాషా తెలిపారు. మృతదేహాన్ని కదిరి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మన్సూర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

9 మంది ఎంపీడీఓలకు ప్రమోషన్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలో 9 మంది ఎంపీడీఓలకు డీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వారికి ప్లేస్‌మెంట్స్ ఖరారు చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్యోగి పేరు	ఎంపీడీఓ ప్రస్తుత స్థానం	డీడీఓగా పోస్టింగ్ స్థానం
శివానందనాయక్	ఏపీడీ మడకశిర	ఏపీడీ హిందూపురం
శకీలా బేగం	శింగనమల	డీవీఓ డ్వామా కర్నూలు
వెంకటరామిరెడ్డి	గాండ్లపెంట	ఏఓ డ్వామా, కడప
రఘునాథగుప్తా	నల్లచెరువు	ఏఓ డ్వామా నెల్లూరు
ఆజాద్	అమడగూరు	ఏపీడీ డ్వామా కమలాపురం
సరస్వతి	హిందూపురం	ఏఓ డ్వామా, కడప
రామక్రిష్ణ	గుమ్మఘట్ట	ఏఓ డ్వామా అనంతపురం
నరేంద్రకుమార్	గోరంట్ల	ఏపీడీ డ్వామా, నంద్యాల
శకుంతల	పెద్దపప్పూరు	ఏపీడీ డ్వామా, కదిరి



సమీక్షలో ప్రజా ప్రతినిధులు, నాయకులు

సంక్షేమం.. అభివృద్ధి డబుల్

(5వ పేజీ తరువాయి)

వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ దుకాణాలు, కార్యాలయాలు మూత పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, జోన్-5 కో-ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐఐసీ ఛైర్మన్ రాజు, ఎంపీలు పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర, బండారు శ్రావణిశ్రీ, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, అంజినప్ప, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్, జనసేన నాయకులు చిలకం మధు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

క్రైం కార్నర్

వృద్ధుడి ఆత్మహత్య

శెట్టూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన కురుబ ఈశ్వరప్ప (65) అనే వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. ఈశ్వరప్ప భార్య అంజినమ్మతో మనస్పర్థల కారణంగా 25 సంవత్సరాల నుంచి వేరుగా వుంటున్నారు. భార్య పుట్టినింట్లో పిల్లలతో కలసి ఉంటోంది. శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు పోయి తిరిగి రాలేదు. శనివారం ఉదయం అతడి అన్న కోడలు జ్యోతి తన పొలంలోకి పోతుండగా ఈశ్వరప్ప చింత చెట్టుకు తాడుతో ఉరి వేసుకోవడాన్ని గుర్తించింది. వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చింది. మృతుడి అన్న గోవిందప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి మృతి

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతపురం క్రాస్ సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి మృతి చెందినట్లు జీఆర్‌పీ పోలీసులు శనివారం తెలిపారు. పట్టాలమీద యువకుడు మృతిచెందినట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. గుర్తుపట్టలేనంతగా శరీరం ముక్కలయిందని, జేబులో ద్విచక్రవాహనం తాళాలు తప్ప ఏవీ లేవన్నారు. సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎలాంటి ఆచూకీ దొరకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిస్తే ధర్మవరం జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బంగారం ఆభరణాల చోరీ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో ఆరుబయట నిద్రిస్తుండగా ఓ మహిళ మెడలో నుంచి బంగారు చైను, మంగళసూత్రాన్ని అపహరించారు. చోరీపై బాధితులు శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన లలితమ్మ, కుళ్లాయప్ప దంపతులు శుక్రవారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన సమయంలో లలితమ్మ మెడలో నుంచి బంగారు చైనును లాక్కెళ్లారు. నిద్ర నుంచి తేరుకున్న లలితమ్మ గట్టిగా కేకలు వేసింది. దీంతో ఇద్దరు దుండగులు పరుగులు తీసి ద్విచక్రవాహనంలో పరారయ్యారని పేర్కొన్నారు. బంగారు చైను, మంగళసూత్రం రెండు తులాల వరకు చోరీకి గురైనట్లు ఆమె ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాకీ పేరుతో బెదిరింపులు

● ఆగ్రహించిన వ్యాపారులు ● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత


బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకున్న స్థానికులు (సర్కిల్‌లో వ్యక్తి)

యాడికి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాకీ వున్నారు... డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన రాయలచెరువులో చోటుచేసుకుంది. కడప జిల్లా రాయచోటికి చెందిన సయ్యద్ గౌస్‌బాషా శనివారం సాయంత్రం పలు దుకాణాల వద్దకు వెళ్లి డబ్బులు బాకీ వున్నారు, ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగాడు. పలు పెయింట్ షాపుల వద్దకు వెళ్లి బ్లాక్‌మెయిల్ చేయడంతో ఆగ్రహించిన షాపు యజమానులు అతడికి దేహశుద్ధి చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామంటూ బెదిరించాడని వ్యాపారులు ఆరోపించారు. విషయం పోలీసులకు సమాచారం తెలపగా అతడిని అదుపులోకి తీసుకున్నారు.

తండ్రి హత్యకు ప్రతీకారం

● రౌడీషీటర్ లోకేంద్ర హత్య కేసులో ముగ్గురి అరెస్ట్



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీకారంతోనే ధర్మవరంలో రౌడీషీటర్ లోకేంద్ర(26) హత్య జరిగినట్లు ఎస్పీ రత్న తెలిపారు. రెండు రోజుల కిందట లోకేంద్రను ధర్మవరం రైల్వేస్టేషన్ సమీపంలో హత్య చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ రత్న శనివారం తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అరెస్ట్ వివరాలను మీడియాకు ఆమె వెల్లడించారు. ఏడాది కిందట ఆటోబాడుగ వివాదంలో మద్యం మత్తులో ఉన్న లోకేంద్ర ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీనివాసులురెడ్డిని హత్య చేశాడు. దీనికి ప్రతీకారం తీర్చుకోవడానికి శ్రీనివాసులురెడ్డి కుమారుడు బాలకృష్ణారెడ్డి వేచి ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే తన స్నేహితులైన సయ్యద్ ఇలియాజ్, డేరంగుల అంజనేయులుతో కలిసి హత్యకు ప్రణాళిక రచించాడు. ఈక్రమంలోనే గత గురువారం సాయంత్రం ధర్మవరంలోని కొత్తపేట శ్రీనిధి మార్ట్ ఎదుట లోకేంద్ర తన తండ్రితో కలిసి చెల్లెలు ఇంటికి వెళ్తూ ఆగాడు. అప్పటికే లోకేంద్రను హత్య చేయడానికి కాచుకుని ఉన్న బాలకృష్ణారెడ్డి అతడి స్నేహితులు లోకేంద్రను అనుసరించారు. తండ్రి టీ తాగడానికి వెళ్లగా లోకేంద్ర తన స్నేహితుడితో కలిసి మోటారుసైకిల్‌పై కూర్చొన్నాడు. ఇదే అదనుగా బాలకృష్ణారెడ్డి తన స్నేహితులు సయ్యద్ ఇలియాజ్, డేరంగుల అంజేనేయులతో కలిసి కారులో వేగంగా వచ్చి వెనుక నుంచి మోటారుసైకిల్‌ను ఢీకొట్టాడు. లోకేంద్ర మోటారుసైకిల్‌పై నుంచి కిందపడగానే బాలకృష్ణారెడ్డి, ఇలియాజ్ కొడవళ్లతో విచక్షణారహితంగా నరికి, చంపారు. అనంతరం నిందితులు వచ్చిన కారులోనే పరారయ్యారు. ఈ హత్య కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణం సీఐ రెడ్డిప్ప, ప్రత్యేక బృందం నిందితులను ఎన్ఎస్‌గేట్‌కు వెళ్లే మార్గంలో శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి కారు, రెండు కొడవళ్లు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పారదర్శకంగా యూరియా పంపిణీ : కలెక్టర్

● అక్రమంగా నిల్వ చేస్తే కేసులు


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులందరికి అవసరమైన యూరియా, ఎరువుల పంపిణీలో సంబంధిత అధికారులు పారదర్శకత పాటించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా యూరియా మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో యూరియా నిలువలు, పంపిణీలో ఆర్డీవోలు, వ్యవసాయాధికారుల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు వ్యవసాయ శాఖ నుంచి వచ్చే డేటా ఆధారంగా రోజుకు ఎంత యూరియా అవసరం అవుతుందో అంచనావేయాలని తెలిపారు. వారానికి అవసరమై యూరియా డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందుగానే ఇండెంట్ పంపాలన్నారు. జిల్లాలోని రైతు సేవాకేంద్రాలు, సహకార సంఘాలు, ప్రైవేటు ఎరువుల దుకాణాలపై నిఘా ఉంచి, అక్రమ నిలువలు, వ్యవసాయేతర అవసరాలకు యూరియాను తరలిస్తే 6ఏ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి రామునాయక్, మార్క్‌ఫెడ్ డీఎం గీతా, డీసీఓ క్రిష్ణానాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, పశుసంవర్థక శాఖ జేడీ శుభదాస్, విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

'నశా ముక్త్ యువ'పై సమావేశం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్‌పై కేంద్ర మంత్రి మన్సుక్ మాండవీయా వర్చువల్ ద్వారా మార్గదర్శనం చేసినట్లు ఆ నలుగురు సేవా సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్ శనివారం పేర్కొన్నారు. వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ యువ కార్యకలాపాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ అనే స్వయం ప్రతిపత్తి సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా 123 ఆధ్యాత్మిక సంస్థలతో కలిసి సెప్టెంబరు 21న నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్‌పై సమ్మిట్ శ్రేణి నిర్వహిస్తారన్నారు. యువతకు మాదకద్రవ్యాలరహిత జీవనశైలిపై అవగాహన పెంచడం, నశా ముక్త్ యువ ప్రతిజ్ఞ చేయించడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా ధ్యానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, నిపుణుల చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యువత పరస్పర సంభాషణలు ఉంటాయన్నారు.

9న నృత్య, క్రీడా పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి నృత్య, క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పట్నం శివప్రసాద్, ధనుంజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భరతనాట్యం, కూచిపూడి, జానపద గిరిజన సంప్రదాయ నృత్యాలలో పోటీలు ఉంటాయన్నారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణపత్రాలు, అసోసియేషన్ గుర్తింపు కార్డు, ఆయా నృత్య క్రీడల పాటలతో ఈనెల 8వ తేదీలోపు సెల్ నంబర్లు : 8328686059, 9515999243 ను సంప్రదించి పంపాలని తెలిపారు.

టమోటా కిలో రూ.16

అనంతపురం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.8, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఐఈడీ సెక్టోరల్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరణ గడువు ఈనెల 10 వరకు పొడిగించినట్లు ఏపీసీ శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుపూజోత్సవం, ఇతర సెలవులు రావడంతో దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

9న పీవీకేకేలో ప్రాంగణ నియామకాలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలమూరు రోడ్డులోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 9న ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఎస్‌వీహెచ్ ఇండియా ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బి.టెక్, డిప్లొమా విద్యార్థులకు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, ఆటోమొబైల్ విభాగాలకు చెందిన 2020 నుంచి 2025 వరకు పాస్ అవుట్ అయిన పురుష అభ్యర్థులు అర్హులు అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.2 లక్షల వేతనంతో పాటు బోనస్ కూడా ఇస్తారని వివరించారు. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, డిప్లొమా ఇంజనీర్ ట్రైనీగా పెనుకొండ సమీపంలోని అమ్మవారిపల్లి దగ్గర ఉన్న సంస్థలో నియమిస్తారని అన్నారు.

రేపటి నుంచి ఇన్‌స్పైర్ ఓరియంటేషన్ తరగతులు

కొత్తచెరువు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 8వతేదీ నుంచి ఇన్‌స్పైర్ ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తామని జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఇన్ స్పైర్ మానాక్, స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నామినేషన్‌లను స్వీకరిస్తామని అన్నారు. దీనిపై ఉపాధ్యాయులకు పాఠశాలల వారీగా అవగాహన కార్యక్రమాల్ని 8,9 తేదీలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. 8న పెనుకొండ డివిజన్‌లోని చిన్మయ విద్యాలయం హిందూపురంలోనూ, మధ్యాహ్నం పుట్టపర్తి డివిజన్‌లోని కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో, 9న ధర్మవరం డివిజన్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలోనూ, మధ్యాహ్నం కదిరి డివిజన్‌లోని కదిరి బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

15 నుంచి రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 15వతేదీ నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళలకు టైలరింగ్, జర్దోసి మగ్గంపై ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగిన 18-45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, పేర్ల నమోదుకు సెల్ నంబరు : 9492583484ను సంప్రదించాలని సూచించారు.

9న ఫార్మా శిక్షణ, ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, స్వర్ణభారత్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న ఫార్మా శిక్షణ, ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, డిప్లొమా, బి.ఫార్మా, ఎమ్మెస్సీ, బి.టెక్ చదివిన 25 ఏళ్ల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని అన్నారు. ఫార్మా రంగంలో అత్యున్నత నైపుణ్య శిక్షణ కల్పించి, వివిధ ప్రముఖ ఫార్మా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. అభ్యర్థులు విద్యార్హత, జనన ధ్రువీకరణ, ఆధార్‌కార్డులతో ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ సెంటర్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు : 8121717846ను సంప్రదించాలని కోరారు.

9న సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 9న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. 2011 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26వతేదీ నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు: 7989017210ను సంప్రదించాలని సూచించారు.

తాడిపత్రికి పెద్దారెడ్డి

● 16 నెలల తరువాత ప్రవేశం
● పట్టణంలో భారీ పోలీసు బందోబస్తు


ఇంటి వద్ద పెద్దారెడ్డికి దిష్టి తీస్తున్న అభిమాని

తాడిపత్రి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య 16 నెలల తర్వాత మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం తాడిపత్రికి చేరారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ నాయకులను నియోజకవర్గం నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో మూడు నెలల తర్వాత ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రికి చేరుకున్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని మాత్రం తాడిపత్రికి రానీయలేదు. పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఆయన కింది స్థాయి నుంచి సుప్రీం కోర్టుదాకా వెళ్లాడు. కోర్టు ఆదేశాల మేరకు భారీ బందోబస్తు మధ్య శనివారం తాడిపత్రిలోని తన స్వగృహం చేరారు. పెద్దారెడ్డి రాకతో పట్టణంలో హై టెన్షన్ వాతావరణం ఏర్పడిం ది. జిల్లా ఎస్పీ ఉదయమే తాడిపత్రికి చేరుకుని భద్రతను సమీక్షించారు. ఆయన ఆదేశాల మేరకు గొడవలు సృష్టిస్తారనే అనుమానం ఉన్న చోటా మోటా నాయకులందరిని ముందుగా హౌస్ అరెస్ట్ చేశారు. పెద్దారెడ్డి మాట్లాడుతూ పోలీసులకు సహకరిస్తానని, తన పార్టీ నాయకులకు అండగా ఉంటానని తెలిపారు. తమ పార్టీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శిస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతానని తెలిపారు. కాగా జేసీ ప్రభాకర్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు తాడిపత్రిలో లేకపోవడం గమనార్హం.

బ్యాంకు దొంగ అరెస్టు

● రూ.2 కోట్ల విలువైన బంగారం స్వాధీనం
● నిందితుడు మాజీ బీఎస్ఎఫ్ జవాను
● వివరాలు వెల్లడించిన ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూపురం రూరల్ మండలం తూముకుంట చెక్‌పోస్టు వద్ద ఎస్‌బీఐలో జరిగిన చోరీ కేసులో అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యుడు అనిల్ కుమార్ పన్వార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతన్నుంచి రూ.2 కోట్ల విలువైన రెండు కేజీల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ రత్న తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్‌తో కలసి శనివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. హరియాణాలోని గుర్గావ్ జిల్లా మారుతికుంజ్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ పన్వార్ మాజీ బీఎస్ఎఫ్ జవాన్ అని, వ్యసనాలకు బానిసై, డబ్బు కోసం బ్యాంకు దోపిడీలకు పాల్పడుతున్నాడని ఎస్పీ తెలిపారు. జైలుకు వెళ్ళి వచ్చినా అతని తీరు మారలేదని, 2018లో అనంతపురం జేఎన్‌టీయూ సమీపంలోని స్టేట్ బ్యాంకులో జరిగిన దొంగతనం కేసులో నిందితుడని తెలిపారు. కోయంబత్తూరు సబ్ జైలులో 5 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించి, జూన్‌లో బయటకు వచ్చాడని, మరో వ్యక్తితో కలిసి జూలై 26న తూముకుంట చెక్‌పోస్టు సమీపంలోని స్టేట్ బ్యాంకులో చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. డీఐజీ షిమోషి ఆదేశాలతో డీఎస్పీ కేవీ మహేష్, హిందూపురం అప్‌గ్రేడ్ సీఐ చంద్ర అంజినేయులు కేసును దర్యాప్తు చేశారని తెలిపారు. ఉమ్మడి జిల్లాతో పాటుగా చిత్తూరు, తిరుపతికి చెందిన 8 ప్రత్యేక బృందాలు 5 రాష్ట్రాలలో గాలింపు చర్యలు చేపట్టి, అనిల్ కుమార్ పన్వార్‌ను అరెస్టు చేశారని తెలిపారు. నిందితుడిని కస్టడీకి తీసుకుని విచారించామని, అతను చెప్పిన వివరాల ఆధారంగా 2 కేజీల బంగారం అభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన హోండా సిటీ కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతనిపై దేశంలోని పలు రాష్ట్రాల్లో 14 దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. ముఠా సభ్యుడిని పట్టుకున్న డీఎస్పీ కేవీ మహేష్, సీఐలు ఆంజనేయులు, అబ్దుల్ కరీం, శేఖర్, జైపాల్ రెడ్డి, రాజ్‌కుమార్, జనార్దన్, ఉమ్మడి అనంతపురంజిల్లా, చిత్తూరు, తిరుపతి జిల్లా ప్రత్యేక బృందాలను ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులు ప్రశంసా పత్రాలను అందచేశారు.


దోపిడీకి ఉపయోగించిన కారు, బైక్, స్వాధీనం చేసుకున్న బంగారంతో పోలీసులు


మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, పక్కన ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

ప్రభుత్వం దృష్టికి ఓటీఎస్, రుణమాఫీ

● ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటీఎస్, చేనేత సహకార సొసైటీల్లో రుణమాఫీ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కస్తామని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అధ్యక్షతన అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ చైర్మన్ మాట్లాడుతూ మొండిబకాయిల రికవరీకి వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)తో పాటు చేనేత సహకార సొసైటీల రుణమాఫీ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఏడీసీసీ బ్యాంకు, సొసైటీలకు ఆప్కాబ్ నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏడీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.650కోట్లు డిపాజిట్ల సేకరణ, రూ.2500కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి , డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవ్‌బాబు, విజయచంద్రారెడ్డి, సీనియర్ మేనేజర్లు అనంత పద్మనాభం, ఆర్‌వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యత పెంచిన అవార్డు

● ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కోనంకి శ్రీధర్


సీఎం చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న డాక్టర్ శ్రీధర్

కళ్యాణదుర్గం/అనంతపురం విద్య, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తనపై బాధ్యత మరింత పెంచిందని అవార్డు గ్రహీత డాక్టర్ కోనంకి శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని ఎస్‌వీజీఎం డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకుడిగా, ఎన్ఎస్ఎస్ అధికారిగా పని చేస్తున్న శ్రీధర్ ఈ నెల 5న విజయవాడలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదివిన కళ్యాణదుర్గం డిగ్రీ కళాశాలలోనే అధ్యాపకుడిగా పని చేయడం అదృష్టమన్నారు. 13 ఏళ్ల అధ్యాపక వృత్తిలో 25 జాతీయ సెమినార్లకు హాజరై పేపర్ ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. 20 పరిశోధనలు, వ్యాసాలు, ఫండమెంటల్స్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ పుస్తకం రాసినట్లు తెలిపారు. గతంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తూ విద్యార్థులకు అకడమిక్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు కూడా శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తనకు లభించిన ఈ అవార్డును తనకు విద్యను బోధించిన గురువులందరికీ అంకితమిస్తున్నట్లు వెల్లడించారు.

12 నుంచి బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలు


ఎంపికైన బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా బాల బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 12వ తేదీ నుంచి బత్తలపల్లి మండలం రామాపురంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశులు తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా జూనియర్ బాల, బాలికల జట్లు వివరాలను శనివారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆయన ప్రకటించారు. జూనియర్ బాలుర విభాగంలో మదన్, జిలాన్, నిఖిల్, చిరంజీవి, రాజశేఖర్, హర్షవర్ధన్, అల్తాఫ్, సుధీర్, జగదీష్, ప్రదీప్, చందు, వినయ్, బాలాజీ ఎంపికయ్యారు. బాలికల జట్టులో వెంకటలక్ష్మి, గౌతమి, మానస, గౌతమిబాయి, అమృత, చరిత, మహేశ్వరి, మదీనా, కమలాక్షి, లోకేశ్వరిబాయి, విద్యారెడ్డి, సింధూజా, జశ్విత ఎంపికయ్యారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి పోటీలకు ఏర్పాట్లు చేశామని, క్రీడాకారులు సాధన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, సభ్యులు బాషా, బాబా, నిర్వాహకులు చిన్నకేశవులు చౌదరి, ఉమాపతి, మోహన, వెంకటనారాయణ పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్, సెక్రటరీ జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ టోర్నీలో మధ్యప్రదేశ్, సెక్రటరీ జట్లు విజయం సాధించాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నేషనల్ ఇన్విటేషనల్ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ సెక్రటరీ లెవెన్ జట్టు, బరోడా జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ సెక్రటరీ జట్టు నిర్ణీత 50ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 317పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన బరోడా జట్టు 40.5 ఓవర్లలో 240పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో ఏసీఏ సెక్రటరీ జట్టు 77పరుగుల తేడాతో విజయం సాధించింది. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ప్రెసిడెంట్ లెవెన్, మధ్యప్రదేశ్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ జట్టు 48.2ఓవర్లలో 283పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన ప్రెసిడెంట్ జట్టు 31.3ఓవర్లలో 145పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో మధ్యప్రదేశ్ జట్టు 138పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి టోర్నమెంట్‌ను పర్యవేక్షించారు.

దండు శ్రీనివాసులుకు సన్మానం

శింగనమల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): శింగనమల మార్కెట్ యార్డు చెర్మన్‌గా నియామకమైన దండు శ్రీనివాసులును జిల్లాకేంద్రంలో శనివారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఏడీసీసీబీ చెర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలంనరసానాయుడు, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయదవ్, అప్కాబ్ చెర్మన్ గన్ని వీరాంజనేయులు పుష్పగుచ్ఛాలందజేసి , శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, జీసీబాబు పాల్గొన్నారు. అలాగే దండు శ్రీనివాసులకు పదవి రావడం పట్ల శింగనమలలోని టీడీపీ నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక భవాని శివాలయంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, టీడీపీ నాయకులు 108 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించారు.

అమెరికా టారిఫ్‌ల పెంపుపై వామపక్షాల నిరసన

అనంతపురం విద్య/రాప్తాడు/ శింగనమల, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): అమెరికా టారిఫ్‌లను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ,సీపీఎం ఇతర వామపక్ష పార్టీల నాయకులు కలిసి శనివారం జిల్లాకేంద్రంలోని టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పార్నపల్లి నారాయణస్వామి, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ భారతీయసరుకుల దిగుమతులపై 50శాతం సుంకంను అమెరికా పెంచడం దుర్మార్గమన్నారు. అమెరికా పెత్తందారి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వామపక్షాలు పెద్దఎత్తున పోరాటాలు చేపడుతాయని పేర్కొన్నారు. సీపీఐ ఎంఎల్ జిల్లాకార్యదర్శి ఇండ్ల ప్రభాకరరెడ్డి, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. అలాగే రాప్తాడులో చేపట్టిన నిరసనలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున , సీపీఎం జిల్లా సెక్రటేరియట్ మెంబర్ బాలరంగయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శులు రవీంద్ర, నరేష్, శివ పాల్గొన్నారు. ఇక శింగనమలలోని నిరసనలో టీ.నారాయణస్వామి, చిన్నప్పయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా విజయశ్రీ



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయశ్రీ

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ విజయశ్రీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన ప్రొఫెసర్ షారోన్ సోనియ రిలీవ్ అయి బాధ్యతలను విజయశ్రీకి అప్పగించారు. అనంతరం విజయశ్రీకి పలువురు అభినందనలు తెలిపారు.

సూపర్ హిట్ సభను విజయవంతం చేద్దాం

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకేంద్రంలో ఈ నెల 10 వ తేదీన జరిగే సూపర్ సిక్స్- సూపర్ హిట్ మహా సభను విజయవంతం చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు పిలుపునిచ్చారు. సభ విజయవంతంపై పరిటాల సునీత మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఇందుకు ఏలూరి సాంబశివరావుతో పాటు ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి, రాప్తాడు అబ్జర్వర్ ఆదోని కృష్ణమ్మ, జనసేన రాప్తాడు ఇన్‌చార్జి సాకే పవన్, కూటమి నాయకులు హాజరయ్యారు. పరిటాల సునీత మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు విజయవంతం చేసే బాధ్యతను తీసుకోవాలన్నారు. సభకు రాప్తాడు నియోజకవర్గం నుంచి రూ. 50 వేల మంది దాకా తరలి రావాలన్నారు. ఇందులో సగం మందికి పైగా మహిళలే ఉండాలని సూచించారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రాప్తాడు అంటే టీడీపీకి కంచుకోట అని, రాప్తాడు ప్రజలు పరిటాల కుటుంబాన్ని, టీడీపీని ఎంతగా ఆదరిస్తున్నారో తెలుసని అన్నారు. రాప్తాడుకు సమీపంలో జరిగే ఈ విజయోత్సవ సభకు భారీగా టీడీపీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, సింగిల్ విండో చైర్మన్లు మరూరు గోపాల్, బ్రహ్మానందరెడ్డి, ఆరు మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతంపై సమావేశం



మాట్లాడుతున్న కోవెలమూడి రవీంద్ర

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్ సభ విజయవంతంపై మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబా కల్యాణమండపంలో శింగనమల నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేతలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులతో ఉమ్మడి జిల్లాల టీడీపీ కోఆర్డినేటర్ కోవెల మూడి రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కలికిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ఏడీసీసీబీ చైర్మన్ కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రామలింగారెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పర్వీన్‌తాజ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కోవెలమూడి రవీంద్ర, బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి వేలాది సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సభను జయప్రదం చేయాలన్నారు. ఇందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత తీసుకోవాలన్నారు. ఏవైనా విభేదాలు ఉంటే పక్కన పెట్టాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 50వేలమంది దాకా తరలిరావాలని సూచించారు. ఆలం నరసానాయుడు,కేశవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

సూపర్‌హిట్ సభతో వైసీపీలో భయం: ఎమ్మెల్యే దగ్గుపాటి



సభా ప్రాంగణంలో మంత్రులతో కలిసి కలియ తిరుగుతున్న దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్రైం, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్- సూపర్ హిట్ సభతో వైసీపీ నాయకుల్లో భయం పట్టుకుందని, అందుకే నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. సభా ప్రాంగణం వద్ద శనివారం ఆయన మంత్రులతో కలిసి పార్కింగ్, హెలీప్యాడ్ తదితర ప్రాంతాల్లో కలియ తిరిగారు. తర్వాత సభావేదిక వద్ద నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తర్వాత మాట్లాడుతూ... ఈనెల 10వ తేదీన అనంతపురం వేదికగా సూపర్‌సిక్స్- సూపర్‌హిట్‌సభ జరగబోతోందన్నారు. లక్షలాదిగా జనం రాబోతుండటంతో.... వైసీపీ నాయకుల్లో భయం పట్టుకుందన్నారు. అందుకే విషప్రచారం చేయాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు. ఎవరెన్ని చేసినా... ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాల్లో పేదలకు అనేక సేవలందించిన ఆర్డీటీకి కేంద్రప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని కోరుతూ ఈనెల 12వ తేదీన కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టనున్నట్లు దళిత ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం స్థానిక ఫాదర్‌ఫెర్రర్ విగ్రహం ఎదుట విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రాణాలైన అర్పిస్తాం... ఆర్డీటీని కాపాడుకుంటాం... అనే నినాదంతో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కేపీ నారాయణ స్వామి, బాలపెద్దన్న, ఓబుళపతి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా క్లస్టర్ సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని ఏపీ గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం ఏఎంసీ మేనేజర్ ఖయ్యూంకి వినతిపత్రం అందజేశారు. నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, వరప్రసాద్, వీరనారప్ప, వినయ్‌ముత్యాలరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పట్ల అవగాహనపై మారథాన్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ నియంత్రణ పట్ల అవగాహన కల్పించడానికి శనివారం మారథాన్ రెడ్ రన్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని డీఆర్వో మలోల, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ప్రారంభించారు. అనంతరం పరుగు పందెంలో విజేతలైన వారికి ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7వేలు నగదును అందజేశారు.

గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్‌గా రావూరి లక్ష్మీదేవి



పరిటాల సునీతను కలిసిన లక్ష్మీదేవి, నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా రావూరి లక్ష్మీదేవి నియమితులయ్యారు. రెండురోజుల కిందట ప్రభుత్వం చేపట్టిన నామినేటెడ్ పోస్టుల భర్తీలో మండలంలోని పాపంపేటకు చెందిన తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీదేవికి అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఆమె శనివారం ఎమ్మెల్యే పరిటాల సునీతను జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. తన నియామకానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

రామగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా.. కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది అధికారులకు తెలియజేస్తామని అన్నారు.

అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న చేపట్టనున్న అన్నదాత పోరుకు సంబంధించిన పోస్టర్లను స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి శనివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ర్యాలీలు చేసి ఆర్డీఓలకు వినతిపత్రాలు అందజేస్తామని అన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

నార్పల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని జడ్పీ సీఈఓ శివశంకర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులు తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని స్థానిక అధికారులకు సూచించారు. ఎంపీడీఓ మమతాదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

నార్పల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ బిల్లులను చెల్లించాలని కోరుతూ మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం ఉపాధి కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పది వారాల బిల్లులు చెల్లించాలని డిమాండ్‌చేశారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ శైలజా రాణికి వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు ఎర్రనాగప్ప, రాజశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, నారాయణ స్వామి, అంజనేయులు పాల్గొన్నారు.

'రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు'

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్ఐ సత్యనారాయణ వైసీపీ నాయకులను హెచ్చరించారు. రాప్తాడు మండలానికి సత్యనారాయణ రెడ్డి, సాకే వెంకటేష్, రామాంజనేయులుకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చారు. రాప్తాడులో గతనెల 27వ తేదీ వైసీపీ నాయకులు విలేకరుల సమావేశంలో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తూ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాలంటూ మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఈ నెల 2వతేదీన ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారిని శనివారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం 41ఏ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న చంద్రశేఖర్ నాయుడు

గార్లదిన్నె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని డీసీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 8వ తేదీన ఎంపీఆర్ డ్యాం పరిధిలోని దక్షిణ కాలువకు సాగునీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 120 రోజుల పాటు సాగునీరు వి డుదల చేస్తుండడంతో ఆయకట్టు పరిధిలోని రైతులందరు పంటలను సాగుచేసుకునేందుకు సిద్ధం కావాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభు త్వం యూరియా సమస్య తలెత్తకుండా రైతులందరికీ యూరియా సరఫరా చేసేందుకు త గిన చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా పం టలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.

ట్రెజరీ ఫంక్షన్ హాల్ పునర్నిర్మాణానికి భూమి పూజ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా శాఖ ఫంక్షన్ హాల్ పునర్నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ట్రెజరీ డీడీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ....ట్రెజరీ ఉద్యోగుల సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ట్రెజరీ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నారాయణ, ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పీపీపీ విధానంతో నష్టం'

అనంతపురం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య విధానంతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఏఐఎస్ఎఫ్ ఎస్కేయూ ప్రధాన కార్యదర్శి రమణయ్య అన్నారు. ఆమేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో వైద్యరంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. పీపీపీ విధానంను అమలు చేయాలని చూస్తోందన్నారు. ఈ విధానం వల్ల ప్రతిభ ఉన్న ఎస్సీఎస్టీబీసీ, మైనార్టీ, ఓబీసీ విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలన్నారు.

ఆస్పత్రిలో పోషకాహార వారోత్సవాలు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):జాతీయ పోషకాహార వారోత్సవాలను స్థానిక సర్వజన వైద్యశాలలో శనివారం నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, మదర్ మిల్క్‌బ్యాంక్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ నాయక్, ఆర్ఎంఓలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ హేమలత హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, ఎదిగేపిల్లలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందగలరని సూచించారు. డైటీషియన్ సాయిపల్లవి తదితరులు పాల్గొన్నారు. అలాగే సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం ఆస్పత్రిలో వివిధ విభాగాల వారిగా డాక్టర్లు, అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఓపీ వేళల్లో తప్పకుండా డాక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. అవసరైన రోగులను అడ్మిసన్‌చేసి సకాలంలో నయంచేసి తిరిగి పంపించేలా చూడాలని కోరారు.

ఉద్యోగాలకు 91మంది ఎంపిక

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీసాయి మాస్టర్ మైండ్ డిగ్రీ కళాశాలలో శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తాధ్వర్యంలో మెగా జాబ్‌మేళా జరిగింది. ఫార్మసీ, వస్తు ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర రంగాలకు చెందిన పదికిపైగా ప్రైవేట్ సంస్థలు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 91మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాపరెడ్డి, కరెస్పాండెంట్ బసయ్య, ప్రిన్సిపాల్ మల్లికార్జున, సీడాప్ ప్రతినిధి నారాయణస్వామి నియామక పత్రాలు అందజేశారు.

పల్లె నివాసానికి మంత్రి సవిత



మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లె కిశోర్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఆలమూరు రోడ్డులో గల మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నివాసానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత శనివారం వెళ్లారు. బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పల్లె రఘునాథ్‌రెడ్డి వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండటంలో పరామర్శించారు. తర్వాత ఆమెకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చీర, సారే ఇచ్చి సత్కరించారు.

న్యూస్ బాక్స్

ఘనంగా వినాయక నిమజ్జనం



స్వయంభేశ్వర ఆలయంలోని వినాయక విగ్రహం

కణేకల్లు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ స్వయంభేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని శనివారం నిమజ్జనం చేశారు. విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ప్రత్యేకంగా అలంకరించి గ్రామపురవీధుల్లో ఊరేగించిన అనంతరం స్థానిక హెచ్చెల్సీ కాలువలో నిమజ్జనం చేశారు.

10లోపు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి



కళ్యాణదుర్గం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కియ పరిశ్రమ బ్రాంచ్ హిందూపురంలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని, ఈ నెల 10 లోపు ఆసక్తి ఉన్న అభ్యర్థులు స్థానిక ప్రజావేదిక వద్ద పూర్తి బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇక్కడి నుంచి 60 మంది దాకా అభ్యర్థులు సెలెక్ట్ అయితే, కళ్యాణదుర్గం నుంచే హిందూపురం వరకు బస్సు సౌకర్యం కూడా కంపెనీనే భరిస్తుందన్నారు. ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుట్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపల్లి గ్రామస్థులు అధికారులు వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ అలివేలమ్మ, ఏపీడీ పుల్లారెడ్డి, ఇతర శాఖల అధికారులు గ్రామానికి వెళ్లి ఆ ఊరి ప్రజలతో మాట్లాడారు. ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ ఊరి సమస్యలను అధికారులకు విన్నవించారు. తమ గ్రామంలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నామని, గ్రామంలోకి వచ్చేందుకు తారురోడ్డు లేక అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. తమ గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలని రెండు నెలల కిందట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణకు కూబా వాట్సాప్ ద్వారా విన్నవించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. త్వరలోనే రోడ్లకు ప్రతిపాదనలు పెట్టి సిమెంట్‌రోడ్లు వేస్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు.

మూడు నెలలుగా అందని ఉపాధి బిల్లులు



కూడేరు శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కూడేరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు కూలీలకు మూడు నెలలుగా బిల్లులు అందకపోవడంతో లబోదిబోమంటున్నారు. మండలంలో మూడు నెలల్లో 8,553 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్లారు. వీరికి జూన్, జూలై, ఆగస్టు నెలల్లో చేసిన పనులకు గాను దాదాపు రూ. 1,01,15,708 కూలి డబ్బులు పెండింగ్ ఉందని అధికారులు చెబుతున్నారు. మూడు నెలలైనా చేసిన పనులకు బిల్లులు అందకపోవడంతో కూలీలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబం పోషణ భారమైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లపై పశువుల సంచారం

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం - ప్రమాదాల బారిన జనం



రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

విడపనకల్లు, సెపెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివిధ ఆలయాలకు చెందిన ఆవులు, దూడలు దాదాపుగా వందకు పైగా ఉన్నాయి. వాటికి గోశాల లేకపోవడంతో అవన్నీ జాతీయ రహదారిపై, ఇతర రోడ్లపై తిరుగుతుంటాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో పాటు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. నెల క్రితం బళ్లారికి చెందిన దంపతులు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. ఆవులు అడ్డు రావడంతో కిందపడి.. తీవ్రంగా గాయపడ్డారు. అలాగే వారం క్రితం పాల్తూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుంగా.. ఆవులు అడ్డురావడంతో కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని బళ్లారి ఆసుపత్రికి తరలించగా.. వేల రూపాయిలు ఖర్చు అయింది. ప్రతి నెలా రెండు, మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. గౌరమ్మ దేవి, సుంకులమ్మ దేవి, బసవేశ్వర ఆలయాలకు చెందిన ఆవులను ఊరిపైకి వదిలేసి ఉంటారు. ఈ పశువులు రోడ్డుపై ఎటు పడితే అటు తిరుగుతున్నా.. అవి దేవుడి పశువులు కావడంతో ఎవరూ ఏమీ అనడం లేదు. వాటికి ఓ గోశాలను ఏర్పాటు చేసి.. ఈ సమస్యలు, ప్రమాదాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మల్బరీసాగుపై రైతులకు అవగాహన

కుందుర్పి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిజవళ్లి గ్రామంలో నా పట్టు నా అభిమానం కింద అనంతపురం జిల్లా ప్రాంతీయ పట్టు నాళ పరిశోధన కేంద్రం, సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త డాక్టర్ డి మురళి సిరికల్చర్ రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి కుసుమకుమారి, డీఓఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన వీరనారప్ప



బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీశక్తి భవనంలో ఏపీఎంగా వీరనారప్ప శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శింగనమల మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఇళ్లపై విద్యుత్ తీగలు

● తక్కువ ఎత్తులో వేలాడుతున్న వైనం
● పట్టించుకోని విద్యుత్ అధికారులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఇళ్లపై తక్కువ ఎత్తులోనే విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. దీంతో ఇంటి పైకి ఎక్కాలంటే ప్రజలు జంకుతున్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలువ గడ్డ ఏరియాలో 25సంవత్సరాల క్రితం విద్యుత్ స్తంభాలను ఇళ్ల ముందర ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో తీగలు తక్కువ ఎత్తులోనే వేలాడుతున్నాయి. చిన్నపాటి గాలీవాన వచ్చినా.. తీగలు ఒకదానితో ఒకటి తగిలి.. నిప్పులు పడుతున్నాయని, ఫ్యూజ్‌లు పోతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. అంతేకాకుండా పలుమార్లు షార్ట్‌సర్క్యూట్ అవుతుండటంతో ఇళ్లలోని విద్యుత్ గృహోపకరణాలు కాలిపోతున్నాయన్నారు. అలాగే గంగానగర్ నుంచి కాలువ గడ్డకు వెళ్లే దారిలో బీజీసీ కాలువ వద్ద విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. అది





మిద్దెపైన చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, కాలువ గడ్డ వద్ద ఒరిగిన స్తంభం

ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీనిపై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, తీగలను సరిచేయాలని కోరుతున్నారు. దీనిపై విద్యుత్ ఏడీఈ నాగేంద్రను వివరణ కోరగా.. హౌసింగ్ బోర్డు కాలువ గడ్డ ఏరియాలో కిందకువేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేస్తామని, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మారుస్తామని అన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం : విప్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం నిర్వహించే సూపర్‌సిక్స్ సూపర్ హిట్ విజయవంతం సభను జయప్రదం చేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీతారామాంజనేయ కళ్యాణ మంటపంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా విప్‌తో పాటు పరిశీలకులు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ సక్సెస్ సభకు అంచనాకు మించి తరలిరావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి మద్దతుదారులే అన్ని పంచాయతీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచులుగా గెలవాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాళు పురుషోత్తం, మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, టంకశాల హనుమంతు పాల్గొన్నారు.

భారీగా తరలిరండి



వజ్రకరూరు సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

వజ్రకరూరు(ఉరవకొండ),సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం నిర్వహించే సభను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, టీడీపీ సీనియర్ నాయకులు గోనుగుంట్ల నాగేంద్ర, నాగభూషణం కోరారు. వజ్రకరూరులోని జనార్థన వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరరావు, తులసీదాస్ నాయక్, వలి, దస్తగిరి, తట్రగల్లు సుధాకర్, బ్యాళ్ల ఈశ్వరయ్య, అనంతయ్య, రమేష్, చాబాల ఎర్రిస్వామి పాల్గొన్నారు.

● బెళుగుప్ప : అనంతపురంలో బుధవారం నిర్వహించే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభను జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద తిప్పయ్య నాయకులకు శనివారం సూచించాడు. అభిమానులు, కూటమి పార్టీ నాయకులు ఈ సమావేశానికి భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, ఎంపీపీ పెద్దన్న, జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడు రాము పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభా స్థలాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ, రాష్ట్ర, జిల్లా నాయకులతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట గుత్తి మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, నాయకులు మహమ్మద్ అలీ ఉన్నారు.

యథేచ్ఛగా కర్ణాటక మద్యం విక్రయాలు

శెట్టూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ మండలం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో పలు గ్రామాల్లో కర్ణాటక మద్యం ఎరులైపారుతోంది. రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో విచ్చలవిడిగా కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు అమ్ముతున్నా ఎక్సైజ్ పోలీసులు, సివిల్ పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల మహిళలు వాపోతున్నారు. తిప్పనపల్లి, మాకొడికి, చిన్నంపల్లి, బొచ్చుపల్లి గ్రామాల్లో విచ్చలవిడిగా కర్ణాటక మద్యం అమ్ముతున్నా ఎక్సైజ్ పోలీసులు నామమాత్రపు దాడులతో సరిపుచ్చుకుంటున్నారని మండిపడుతున్నారు. పలు గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయదారులను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నా.. మామూలు పుచ్చుకుని వారిని వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కర్ణాటక మద్యం విచ్చలవిడిగా అమ్ముతుండటంతో చాలా మంది యువకులు మద్యానికి బానిసలు అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఇటీవలే అనుంపల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ పల్లె నిద్ర కార్యక్రమంలో ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. కర్ణాటక మద్యం విక్రయాలను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రిజర్వాయర్‌కు 2,191 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,191 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,151 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. రిజర్వాయర్‌లో 1.694 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఫేజ్-2కు 1,997 క్యూసెక్కుల నీరు వెళ్తోందన్నారు.



మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా నాయకుడు దేవేంద్రప్ప

కార్పొరేట్ సెలూన్లతో అన్యాయం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటుతో సాంప్రదాయ క్షవర వృత్తిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పలు కుల సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంచార జాతులసంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన రౌండ్ టెబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. ఇతర కులాలు, మతాల వారు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పట్టణంలో కార్పొరేట్ సెలూన్ల షాపులు నిర్వహిస్తున్నారని, దీంతో దానిమీదే ఆధారపడి జీవనం సాగిస్తున్న క్షవర వృత్తిదారులు వారితో పోటీ పడలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని, భవిష్యత్‌లో ఇక్కడ నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు కుల సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, బీ శ్రీనివాసులు, జగ్గలి రమేష్, వై శ్రీనివాసులు, దేవేంద్రప్ప, ఎల్లప్ప, స్వామిదాస్, జన్నెమస్తాన్, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, కుళాయప్ప, కసాపురం రమేష్, సురేంద్ర, తిమ్మప్ప పాల్గొన్నారు.

సుంకాలను అమెరికా రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం వసూలును వెంటనే రద్దు చేయాలని వామ పక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అజంతా సర్కిల్‌లో శనివారం వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. భారత దేశంలో తయారు చేసిన టెక్స్‌టైల్స్, గార్మెంట్, జ్యువలరీ, లెదర్ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం వసూలకు పూనుకుందన్నారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితి తగ్గించి విద్యార్థుల భవిష్యతును దెబ్బతీయడం తగదన్నారు. దేశంపై విధించిన అంక్షలు వెంటనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ సురేష్, నాయకులు రామాంజినేయులు, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోవిందు, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి, పట్టణ సహాయకార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజినేయులు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పామిడికి చేరిన సేవ్ ఆర్డీటీ పాదయాత్ర



పామిడిలో స్వాగతం పలుకుతున్న ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్

పామిడి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సేవ్ ఆర్డీటీ-సేవ్ అనంతపురం నినాదంతో సాకే గోవిందు చేపట్టిన మహా పాదయాత్ర పామిడికి చేరుకుంది. రెండవ రోజైన శనివారం పెద్దవడుగూరు మండలం మిడుతూరు నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర పామిడి మీదుగా గార్లదిన్నె వరకు సాగింది. పామిడిలో ఈ యాత్రకు ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను మంజూరు చేయాలని వారు కోరారు. పలు ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దోనిముక్కల రోడ్డులో క్రైస్తవులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరమ్ కమిటీ సభ్యులు టీడీపీ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, తహసీల్దార్ రమాదేవి, టౌన్‌ప్లానింగ్ అధికారికి శనివారం వినతి పత్రాలు అందజేశారు. దోనిముక్కల రోడ్డులో శ్మశాన వాటిక లేక క్రైస్తవులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ కమిటీ కార్యదర్శి జయపాల్, కోశాధికారి అంథోని, సహాయ కార్యదర్శి జ్యోతిరాజు, సభ్యులు అహరోన్, కాంత్రికుమార్, దానియల్, రాజు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని సచివాలయ ఉద్యోగుల నిరసన

పామిడి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించాలని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లకు మ్యాప్ చేసి బలవంతంగా ఇంటింటికీ తిరిగి సర్వేలు చేయించడం బాధాకరమన్నారు. అనంతరం ఎంపీడీఓ తేజోత్స్నకు వినతిపత్రం అందజేశారు.

● గుత్తి : సచివాలయ ఉద్యోగులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం చేపట్టారు. ప్రభుత్వం నేషనల్ ఇంక్రిమెంట్‌లు ఇవ్వడంలేదని, తమ న్యాయసమ్మతమైన డి మాండ్లను పరిష్కరించాలని పలు మార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. డోర్ టూ డోర్ క్లస్టర్ మ్యాపింగ్ తదితర విధులు తమకు అప్పగించరాదన్నారు. మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయాకు వినతి పత్రం అందజేశా రు. ఇందులో వినయ్, ప్రశాంత్,వెంకట్, కిరణ్, సుమలత, మురళీకృష్ణ, వెంకటేష్, చంద్రకళ పాల్గొన్నారు.





పామిడి, గుత్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

క్రైం న్యూస్ ..

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

గుత్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలోని పడమట వీదికి చెందిన అలీషేర్‌తమీమ్ ఎజాజ్(43) గుత్తి సమీపంలోని జక్కలచెరువు రైల్వే స్టేషన్ దగ్గర శనివారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన ఐఓసీఎల్‌లో కాంట్రాక్టర్‌గా విధులు నిర్వహించేవాడు. బెట్టింగ్‌లు, అప్పులబాధ, ఆర్థిక పరిస్థితుల కారణంగా జీవితంపై విరక్తి చెందిన ఆయన తన ద్విచక్రవాహనాన్ని ట్రాక్ సమీపంలో ఉంచి.. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

వజ్రకరూరు(ఉరవకొండ),సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన విద్యార్థి మహేష్ నాయక్ ఆచూకీ లభ్యమైంది. ఈ నెల 4వ తేదీ రాత్రి నుంచి మహేష్ కనిపించకుండా పోయాడు. దీంతో విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి గుంతకల్లులోని హనుమాన్ సర్కిల్ వద్ద తిరుగుతుండగా పోలీసులు గమనించారు. వివరాలు తెలుసుకుని వజ్రకరూరు స్టేషన్‌కు పిలుచుకొని వెళ్లారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.

యూరియా కోసం పడిగాపులు



యూరియా కోసం క్యూలో నిరీక్షిస్తున్న రైతులు

పామిడి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఖరీఫ్‌లో పంటలను సాగుచేస్తున్న రైతులు యూరియా కోసం పడిగాపులు తప్పడం లేదు. శనివారం రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు క్యూలో నిలబడి నిరీక్షించారు. పామిడి, మండలంలోని వంకరాజుకాలువ రైతు సేవా కేంద్రాల్లో మాత్రమే యూరియాను పంపిణీ చేశారు. అదీ ఒక్కొక్క రైతుకు రెండు సంచుల యూరియాను పంపిణీ చేశారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



లక్ష్మంపల్లిలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

శెట్టూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురష్కరించుకొని లక్ష్మంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది ఉపాధ్యాయులను గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఉపాధ్యాయులపై కవితలు, పాటలు, నాటికల రూపంలో తమ భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మర్రిస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప, బీజేపీ సీనియర్ నాయకుడు బంగారు మల్లారెడ్డి, టీడీపీ యువ నాయకుడు సోమనాథ్, ఎస్ఎంసీ ఛైర్మన్ బాబు, రామకృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు అందుకున్న టీచర్లను సన్మానిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనహాళ్ సాయిలీల, ఉప్పరహాళ్ వాణిశ్రీ, గోనేహాళ్ కాళిదాసురాజు, ఉద్దేహాళ్ పవన్ ఉపాధ్యాయులు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారు. వారిని శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో తహశీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్, ఎంఈఓ మల్లికార్జున సన్మానించారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ఉంతకల్లులో శాంతిర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ వేడుకలను మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో శాంతిర్యాలీ చేపట్టారు.

మైనార్టీ యువకుల రక్తదానం



రాయదుర్గంలో రక్తదానం చేస్తున్న యువకులు

రాయదుర్గం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం మైనార్టీ యువకులు స్థానిక ఆత్మకూరు వీధిలో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో 40 మంది రక్తదానం చేశారు. బళ్లారి విమ్స్ రక్తసేకరణ చేపట్టింది. కార్యక్రమంలో మహ్మద్‌షఫి, హబీబురెహ్మాన్, అల్లాబకాష్, ఫైజుల్లాల పాల్గొన్నారు.

మేనేజర్ లేక అవస్థలు



ఖాళీగా ఉన్న బ్యాంకు మేనేజరు కుర్చీ

బెళుగుప్ప, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ జూలై 27 నుంచి సెలవులో ఉన్నారు. మేనేజర్ లేకపోవడంతో కొత్త రుణాలు పొందడానికి.. లాక్‌లో వున్న ఖాతాలను పునఃప్రారంభించడానికి ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. నెలన్నర నుంచి అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారంటూ వారు వాపోతున్నారు.